రిలే నిరాహార దీక్షకు పారామెడికల్ విద్యార్థుల మద్దతు

రిలే దీక్షల్లో కూర్చున్న పారామెడికల్ విద్యార్థులు

ఎదులాపురం, ఫిబ్రవరి 10 : జిల్లా కేంద్రంలోని ఆర్అండ్బీ అతిథిగృహం ఎదుట కొనసాగుతున్న రైల్వేలైన్ సాధన కమిటీ రిలే నిరాహార దీక్షకు శనివారం పారా మెడికల్ కళాశాల విద్యార్థులు మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా కమిటీ చైర్మన్ నారాయణ మాట్లాడుతూ ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ అసెంబ్లీలో జిల్లా సమస్యలు ప్రస్తావించినప్పటికీ ఆదిలాబాద్ నుంచి ఆర్మూర్ రైల్వేలైన్ గురించి సభ దృష్టికి తీసుకురాకపోవడంపై విచారం వ్యక్తం చేశారు.

మందుబాబులకు అడ్డాగా పల్లె ప్రకృతి వనం

బజార్‌హత్నూర్‌లోని పల్లె ప్రకృతి వనం మందుబాబులకు అడ్డాగా మారింది. ప్రతి నిత్యం మందుబాబులు విచ్చలవిడిగా చెట్ల నీడలో కూర్చొని మద్యం తాగుతూ ఇష్టరీతిలో సీసాలు పడేస్తూ ధ్వంసం చేస్తున్నారు. దీంతో ప్రకృతి ప్రేమికులు సేదతీరేందుకు అటు వైపు వెళ్తే దారి పోడువున మద్యం సీసాలు దర్శనమిస్తున్నాయి. ఇప్పటికైన సంబంధిత అధికారులు చొరవ తీసుకోవాలని మందుబాబుల ఆగడాలకు అడ్డుకట్ట వేయాలని ప్రకృతి ప్రేమికులు కోరుతున్నారు.

- బజార్‌హత్నూర్, ఫిబ్రవరి 10

బజార్‌హత్నూర్ పల్లెప్రకృతివనంలో విచ్చలవిడిగా పడేసిన మద్యం సీసాలు

రోడ్డు భద్రతపై అవగాహన

ఆదిలాబాద్ రూరల్, ఫిబ్రవరి 10: జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాల సందర్భంగా జిల్లా కేంద్రంలోని సంజయ్‌గాంధీ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో పోలీస్, రవాణా శాఖ ఆధ్వర్యంలో శనివారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మావల పోలీస్ స్టేషన్ ఎస్ఐ విష్ణువర్ధన్ మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల నివారణ, ట్రాఫిక్ రూల్స్, డ్రైవింగ్ లైసెన్స్, హెల్మెట్ అవశ్యకత గురించి వివరించారు. కార్యక్రమంలో ఆదిలాబాద్ రవాణా శాఖ మోటర్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ రవికుమార్, అసిస్టెంట్ మోటర్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ సురేశ్, ప్రిన్సిపాల్ భరద్వాజ, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ నిషేధంపై అవగాహన

పాటల ద్వారా అవగాహన కల్పిస్తున్న కళాకారులు

ఇంద్రవెల్లి, ఫిబ్రవరి 10: కేస్లాపూర్ గ్రామంలోని నాగోబా జాతరలో సాంస్కృతిక సారథి కళాజాత ఆధ్వర్యంలో భక్తులకు ప్లాస్టిక్ నిషేధంతో పాటు ప్రభుత్వ సంక్షేమ పథకాలు, పరిసరాల పరిశుభ్రతపై పాటల ద్వారా అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కళాకారులు, తదితరులు పాల్గొన్నారు.

పకడ్బందీగా సర్వే నిర్వహించాలి

ఇచ్చోడ, ఫిబ్రవరి 10 : ప్రభుత్వం అమలు చేస్తున్న మహాలక్ష్మీ పథకంలో భాగంగా గ్యాస్ సిలిండర్ సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని ప్రత్యేకాధికారి, ఎంపీడీవో రాంప్రసాద్ సూచించారు. శనివారం మాదపూర్, అడిగామ(కే), తలమడ్రిలో నిర్వహిస్తున్న సర్వేను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హులైన లబ్ధిదారులను దరఖాస్తు చేసుకోవాలని, అధికారులు తప్పులు లేకుండా నమోదు చేయాలని సూచించారు. ఆయన వెంట పంచాయతీ కార్యదర్శి విజయ్ భాస్కర్ ఉన్నారు.

గృహలక్ష్మీ వివరాల సేకరణ

భీంపూర్, ఫిబ్రవరి10: గోముత్రి, కరణ్‌వాడి గ్రామాల్లో శనివారం ఏఈ శ్రావణ్‌కుమార్, రీడర్ అనిల్ మీటర్ల సర్వీసు నంబర్లకు ఆధార్, రేషన్‌కార్డు, సెల్ నంబర్లను అనుసంధానం చేసే ప్రక్రియ చేపట్టారు. రైతులు, ఇతర ఉపాధుల వారు పనులకు వెళ్లిన మీటర్ల వద్ద వివరాలు ఉంచాలని ఏఈ సూచించారు.

నేడు ప్రవేశ పరీక్ష

ఇచ్చోడ, ఫిబ్రవరి 10 : గురుకుల పాఠశాలలోని ఐదో తరగతిలో ప్రవేశానికి గిరిజన, సాంఘిక సంక్షేమ, జ్యోతిబాపూలే, జనరల్ గురుకులాలు ఉమ్మడి ప్రవేశ పరీక్ష ఆదివారం నిర్వహించనున్నట్లు గిరిజన గురుకుల పాఠశాల, కళాశాల ప్రిన్సిపాల్ రాజేంద్ర ప్రసాద్ తెలిపారు. ఇచ్చోడ లోని మూడు కేంద్రాలు గిరిజన గురుకుల బాలుర పాఠశాల, గిరిజన గురుకుల బాలికల పాఠశాల, సాంఘిక సంక్షేమ బాలుర పాఠశాలల్లో 816 విద్యార్థులు పరీక్ష రాయనున్నట్లు తెలిపారు. పరీక్ష ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ఉంటుందని పేర్కొన్నారు. విద్యార్థులు గంట ముందుగానే పరీక్షా కేంద్రానికి బ్లూ లేదా బ్లాక్ బాల్ పాయింట్ పెన్, ఆధార్ కార్డు, వాటర్ బాటిల్ ఖచ్చితంగా వెంట తీసుకురావాలని, సెంటర్‌కి సంబంధించి వివరాలకు 9490957300 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

అబాకస్ పోటీల్లో విద్యార్థి ప్రతిభ

బోథ్, ఫిబ్రవరి 10: నిర్మల్‌లోని దీక్ష జూనియర్ కళాశాలలో నిర్వహించిన ఆదిలాబాద్ ఉమ్మడి జిల్లా అబాకస్, వేదిక్ మ్యాథ్స్ జిల్లా స్థాయి పోటీల్లో బోథ్‌లోని నాగభూషణం పాఠశాలకు చెందిన విద్యార్థి ప్రతిభ కనబర్చాడు. శనివారం నిర్వహించిన పోటీలో జిట్టా రిత్విక్ జిల్లా స్థాయిలో ప్రథమ బహుమతి గెలుచుకున్నాడు. ఈ నెల 25వ తేదీన జరగనున్న రాష్ట్రస్థాయి కంపిటేషన్ పోటీలకు ఎంపికయ్యాడు. పాఠశాలకు చెందిన ఎం భవిష్రాజ్, బీ తన్వి, శ్రేహిత్, హర్షిత కన్సోలేషన్ బహుమతులు గెలుచుకున్నారు. వీరికి నిర్మల్ వన్ టౌన్ ఎస్ఐ శంకర్, అబాకస్ పరీక్ష నిర్వాహకులు స్రవంతి, లక్ష్మీనారాయణ, సాగర్, శివ, నిశచల, స్రవంతి బహుమతులు అందజేశారు. పాఠశాలకు చెందిన విద్యార్థులు గెలుపొందాడంపై కరస్పాండెంట్ కిశోర్ కుమార్, ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు.

జిల్లాస్థాయిలో ప్రథమ బహుమతి అందుకుంటున్న జిట్టా రిత్విక్

పిప్పల్‌కోటిలో శివాలయం ప్రారంభం

పిప్పల్‌కోటిలో డప్పువాయిద్యాలతో ఊరేగింపుగా వెళ్తున్న గ్రామస్తులు

భీంపూర్, ఫిబ్రవరి 10 : పిప్పల్‌కోటి గ్రామంలో నిర్మించిన శివాలయాన్ని శనివారం సంప్రదాయ పూజలతో ప్రారంభించారు. మహిళలు శివపార్వతుల విగ్రహాలను డప్పువాయిద్యాల నడుమ ఆలయానికి తీసుకువచ్చారు. ఆదివారం శివపార్వతులు, నందీశ్వరుడి విగ్రహాలను ప్రతిష్ఠాపన చేయనున్నారు. ఈ సందర్భంగా మహా అన్నదానం కోసం ఆలయ కమిటీ వారు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ పూజలలో వైస్ ఎంపీపీ గడ్డం లస్మన్న, మాజీ సర్పంచ్ కేమ కళ్యాణి ,మాజీ ఉపసర్పంచ్ దొంతుల సుభాష్, నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, గంగయ్య, రమేశ్, గ్రామస్తులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న మాజీమంత్రి జోగు రామన్న

ఆదిలాబాద్ రూరల్, ఫిబ్రవరి 10 : ఆదిలాబాద్‌కు చెందిన బీఆర్ఎస్ కార్యకర్త లాంటిలి మహేశ్ తండ్రి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. శనివారం శంకర్‌గుట్టలోని వారి నివాసానికి మాజీ మంత్రి జోగు రామన్న వెళ్లి వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయన వెంట ధమ్మాపాల్, వాసు, దత్తు, మల్లేశ్ ఉన్నారు.

అమరావతి హాకీ టోర్నమెంట్‌కు జిల్లా క్రీడాకారులు

ఆదిలాబాద్ రూరల్, ఫిబ్రవరి 10 : మహారాష్ట్రలోని అమరావతిలో జరిగే హాకీ టోర్నమెంట్‌లో పాల్గొనేందుకు ఆదిలాబాద్‌కు చెందిన హాకీ క్రీడాకారులు శనివారం బయలుదేరి వెళ్లారు. అమరావతిలో ఈ నెల 11 నుంచి జరిగే ప్రైవేట్ హాకీ టోర్నమెంట్‌లో పాల్గొనేందుకు బయలుదేరి వెళ్లిన క్రీడాకారులకు ఒలింపిక్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు బాలూరి గోవర్ధన్ రెడ్డి చేయూత అందించారు. టోర్నమెంట్‌లో పాల్గొనే క్రీడాకారులను ప్రోత్సహించేలా తన సొంత డబ్బులతో వారిని పంపించారు. కార్యక్రమంలో హాకీ కోచ్‌లు రవి, శేఖర్, ఖేలో ఇండియా కోచ్ శ్రీనివాస్, మేనేజర్ హిజాజ్ పాల్గొన్నారు.

కలప స్వాధీనం

జైనథ్(బేల), ఫిబ్రవరి 10: బేల మండలంలో నివల్కర్ మహాదేవ్ అనే కార్పెంటర్ ఇంట్లో తనిఖీలు చేయగా అక్రమంగా అనుమతి లేకుండా టేకు కలప సైజులు స్వాధీనం చేసుకున్నట్లు ఆదిలాబాద్ టాస్క్‌ఫోర్స్ ఫారెస్ట్ రేంజ్ అధికారి వాహబ్ అహ్మద్ తెలిపారు. ఈ అక్రమ కలప నిల్వపై విచారణ చేస్తుండగా సదరు ఇంటి యజమాని నివల్కర్ మహాదేవ్, అతని కుటుంబీకులు అటవీ శాఖ సిబ్బందిపై దుర్భాషలాడుతూ బెదరిస్తూ వారి విధులకు అడ్డుపడ్డారని తెలిపారు. అటవీశాఖ సిబ్బందిని ఇబ్బందులకు గురి చేసిన మహాదేవ్‌పై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు పేర్కొన్నారు. స్వాధీనం చేసుకున్న టేకు కలప రూ.28 వేలు ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో ఫారెస్ట్ సెక్షన్ అధికారి గులాబ్, ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ సాజన్‌లాల్, పాండురంగ్, శ్యాం సుందర్ పాల్గొన్నారు.

యువకుడి ఆత్మహత్య

జైనథ్, ఫిబ్రవరి 10 : లక్ష్మిపూర్ గ్రామానికి చెందిన దేవల్ల సాయికుమార్(27) శనివారం పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్ఐ పురుషోత్తం తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి.. సాయికుమార్ మద్యానికి పూర్తిగా బానిసయ్యాడు. ఈ క్రమంలో శుక్రవారం రాత్రి తన పొలానికి వెళ్లి శనగ పంటకు వాడే పురుగుల తాగి ఇంటికి ఫోన్ చేశాడు. కుటుంబ సభ్యులు పొలానికి వెళ్లి చూడగా అపస్మారకస్థితిలో పడి ఉన్నాడు. 108 ద్వారా రిమ్స్‌లో చేర్పించారు. చికిత్స పొందుతూ రాత్రి 11 గంటల ప్రాంతంలో మృతి చెందాడు. మృతునికి భార్య మమత, నెల రోజు బాబు ఉన్నాడు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

నాగోబాను దర్శించుకున్న ఎమ్మెల్సీ

ఉట్నూర్, పిబ్రవరి 10: ఆదివాసీల ఆరాధ్య దైవం నాగోబాను ఉమ్మడి జిల్లా ఎమ్మెల్సీ దండె విఠల్ దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాగోబా చాలా పవిత్రమైన దేవత అన్నారు. గిరిజనుల సంస్కృతీ సాంప్రదాయాలు చాలా గొప్పవన్నారు. రాష్ట్రంలోని ప్రజలు సుఖసంతోషాలతో జీవించాలని కోరుకున్నట్లు పేర్కొన్నారు. ఆయన వెంట బోథ్ ఎమ్మెల్యే జాదవ్ అనిల్, ఉట్నూర్ ఎంపీపీ పంద్ర జైవంత్‌రావ్, బీఆర్ఎస్వీ జిల్లా అధ్యక్షుడు ధరణి రాజేశ్ ఉన్నారు.

ఆశ్రమ పాఠశాలను సందర్శించిన జీసీడీవో

ఆదిలాబాద్ రూరల్, ఫిబ్రవరి 10 : ఆదిలాబాద్ మండలం మామిడిగూడలోని ఆశ్రమ బాలికల పాఠశాలను శనివారం జీసీడీవో మెస్రం ఛాయ సందర్శించారు. పదో తరగతి విద్యార్థులకు నిర్వహిస్తున్న ప్రత్యేక తరగతులను, స్లిప్ టెస్ట్ నిర్వహణ వివరాలు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులు ఏ గ్రేడ్ సాధించేందుకు తగిన సలహాలు, సూచనలు ఇచ్చారు. ఆమె వెంట హెచ్ఎం అశోక్ ఉన్నారు.

మాజీ సర్పంచ్‌కు సన్మానం

బోథ్, ఫిబ్రవరి 10 : బోథ్‌లోని ప్రసాద్ దవాఖానలో శనివారం మాజీ సర్పంచ్ సురేందర్ యాదవ్‌ను డాక్టర్ ప్రసాద్, ఆత్మ చైర్మన్ సుభాష్, గ్రంథాలయ డైరెక్టర్ రమణ గౌడ్ సన్మానించారు. కార్యక్రమంలో డ్యాగల నారాయణ, దేవీదాస్, చిలుకూరి వెంకటరమణ, గంగబాబు గౌడ్, రామారావ్ పాల్గొన్నారు.

పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలి

ఉట్నూర్ రూరల్, ఫిబ్రవరి 10: పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలని ఎంపీపీ పంద్ర జైవంత్‌రావ్ అన్నారు. పచ్చదనం పరిశుభ్రత కార్యక్రమంలో భాగంగా శనివారం చింతగూడ గ్రామంలో మురుగు కాల్వలో పూడిక తీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో పచ్చదనం వల్ల అహ్లాదకరమైన వాతావరణం ఏర్పడుతుందని అన్నారు. అందుకు హరితహారంలో నాటిన ప్రతి మొక్క సంరక్షించుకోవాలని సూచించారు. ఇంటి పరిసరాలలో, డ్రైనేజీలో చెత్త లేకుండా చూసుకోవాలని అన్నారు. కార్యక్రమంలో పంద్ర లచ్చు, కోట్నాక్ జగన్, పంద్ర మనోహర్, సిడాం మోతీరాం, పంద్ర నాగోరావ్, పంచాయితీ కార్యదర్శి ప్రవీణ్, గ్రామస్తులు పాల్గొన్నారు.

చింతగూడలో డ్రైనేజీలో పూడికతీస్తున్న ఎంపీపీ పంద్ర జైవంత్‌రావ్

మాజీ సర్పంచ్‌కు సన్మానం

మాజీ సర్పంచ్‌ను సన్మానిస్తున్న గ్రామస్తులు

ఇచ్చోడ, ఫిబ్రవరి 10 : కుంటగూడ గ్రామ మాజీ సర్పంచ్ గంగరాం, మాజీ వార్డు సభ్యులను శనివారం గ్రామస్తులు శాలువాలతో సన్మానించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ గంగరాం గ్రామానికి చేసిన సేవలు అభినందనీయమన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రమేశ్, మాజీ ఉపసర్పంచ్ లక్ష్మణ్, గ్రామస్తులు పాల్గొన్నారు.

విద్యార్థుల తల్లిదండ్రులకు అవగాహన

బోథ్, ఫిబ్రవరి 10 : బోథ్‌లోని సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాల (బాలికల)లో శనివారం సాంఘిక సంక్షేమ గురుకుల సొసైటీ ఆధ్వర్యంలో విద్యార్థుల తల్లిదండ్రులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ స్వర్ణలత మాట్లాడుతూ విద్యార్థుల మానసిక, శారీరకంగా విషయాల్లో ఏ విధమైన మార్పులు ఉంటాయో వివరించారు. తల్లిదండ్రులు పిల్లలకున్న సమస్యలు తమ దృష్టికి తీసుకువస్తే విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకొని వారికి కౌన్సెలింగ్ ఇవ్వడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో స్కూల్ కౌన్సిల్ సెల్ మెంబర్ మాధవి, కమల, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రపంచ పప్పు దినుసుల దినోత్సవం

ఆదిలాబాద్ రూరల్, ఫిబ్రవరి 10 : ఆదిలాబాద్ కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో శనివారం ప్రపంచ పప్పు దినుసుల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా శాస్త్రవేత్తలు డాక్టర్ కే రాజశేఖర్, డాక్టర్ మోహన్‌దాస్ మాట్లాడుతూ జీవితంలో పప్పు దినుసుల పాత్ర, ఉపయోగాలు, ఉండే ప్రోటీన్ల గురించి వివరించారు. రైతులకు అంతర పంటలో పప్పు దినుసులను ఎలా పండించాలో తెలిపారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు డాక్టర్ శివ చరణ్, డాక్టర్ పోశాద్రి, డాక్టర్ సునీల్‌కుమార్, రైతులు పాల్గొన్నారు.

కేంద్ర పథకాలను ప్రజలకు వివరించండి

గుడిహత్నూర్, ఫిబ్రవరి 10 : కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలు, అమలు చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలు ప్రజలకు వివరించాలని శక్తి వందన్ రాష్ట్ర కన్వీనర్ సుహాసినిరెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు పతాంగే బ్రహ్మానంద్ అన్నారు. శనివారం గుడిహత్నూర్‌లోని శివ కల్యాణ మండపంలో నారి శక్తి వందన్ అభియాన్ వర్క్‌షాప్ నిర్వహించారు. ఆదిలాబాద్ అసెంబ్లీ కన్వీనర్ విజయ్ బోయార్, ఇచ్చోడ జడ్పీటీసీ బాబారావు, జిల్లా అధికార ప్రతినిధి డాక్టర్ లక్ష్మణ్, ఎంపీపీ భరత్, నాయకులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి

ఆదిలాబాద్ రూరల్, ఫిబ్రవరి 10 : జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ సైన్స్ డిగ్రీ కళాశాలలో శనివారం పూర్వ విద్యార్థి సంఘం సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి పూర్వ విద్యార్థి సంఘం అధ్యక్ష, కార్యదర్శులు బాలూరి గోవర్ధన్ రెడ్డి, వెంకటి హాజరై మాట్లాడారు. కళాశాలలోని సమస్యలు, అభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలు గురించి చర్చించారు. రాబోయే మార్చి, ఏప్రిల్‌లో కెమిస్ట్రీ, హిందీ విభాగాల ఆధ్వర్యంలో నిర్వహించే జాతీయ సెమినార్లకు ఆర్థిక వనరులు సమకూర్చడానికి తమవంతు ప్రయత్నం చేస్తామని పేర్కొన్నారు. కంప్యూటర్ ల్యాబ్‌కు అవసరమైన కంప్యూటర్లు సమకూర్చేందుకు ప్రయత్నిస్తానని లేదా తనే సొంతంగా ఐదు కంప్యూటర్లు సమకూరుస్తానని రాష్ట్ర స్థాయి పోటీ పరీక్షలు నిపుణులు బద్ధం పురుషోత్తం పేర్కొన్నారు. ఎల్లవేళలా అందుబాటులో ఉండి కళాశాలకు అవసరమైన సహాయం చేయడానికి సిద్ధంగా ఉన్నట్లు పూర్వ విద్యార్థులు తెలిపారు. కార్యక్రమంలో అధ్యాపకులు రఘునాథ్, సంతోష్‌కుమార్, రమేశ్, నర్సింగరావ్, విజయకుమార్, అనిత, తిరుపతి, పూర్వ విద్యార్థులు శ్రీకాంత్, మురళీధర్ పాల్గొన్నారు.

మహిళా చట్టాలపై అవగాహన

ఆదిలాబాద్ రూరల్, ఫిబ్రవరి 10 : జిల్లా కేంద్రంలోని ఎస్ఆర్ డీజీ స్కూల్‌లో శనివారం మహిళా సాధికారత ఆధ్వర్యంలో మహిళా చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జిల్లా మహిళా సాధికారత అధికారి యశోద, సఖీ కేంద్రం నిర్వాహకురాలు సరస్వతి మాట్లాడుతూ మహిళా చట్టాల గురించి వివరించారు. పాఠశాల పిల్లలు వివిధ మహిళా పాత్రలతో మహిళలు ఎలా రాణిస్తున్నారో కండ్లకు కట్టినట్లు ప్రదర్శించారు. కార్యక్రమంలో జోనల్ ఇన్‌చార్జి శ్రీనివాస్ రెడ్డి, ప్రిన్సిపాల్ క్రాంతికుమార్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న మహిళా సాధికారత అధికారి యశోద

పూర్వ తోయగూడ గ్రామస్తుల అపూర్వ సమ్మేళనం



అపూర్వ సమ్మేళనంలో పాల్గొన్న తోయగూడ గ్రామస్తులు

జైనథ్(బేల), ఫిబ్రవరి 10 : బేల మండలంలోని పూర్వ తోయగూడ గ్రామస్తుల అపూర్వ సమ్మేళనం శనివారం ఘనంగా నిర్వహించారు. 1984 సంవత్సరంలో సాత్నల ప్రాజెక్టు ముంపునకు గురి కావడంతో అక్కడి నుంచి వీరి గ్రామాలకు వలస వెళ్లి స్థిర నివాసం ఏర్పాటు చేసుకున్నారు. 40 సంవత్సరాలు వీడిపోయిన గ్రామాలకు రెండు సంవత్సరాల నుంచి ఆత్మీయ సమ్మేళనం నిర్వహించి గ్రామస్తులకు కలిసి గ్రామ దేవతలకు పూజలు నిర్వహించారు. సవార్ల గూడ ఆట, బతుకమ్మ పాటలు పాడుకుంటూ ఆనందంగా గడిపారు. అనంతరం తోయగూడ గ్రామ శివారులో మహా అన్నదానం నిర్వహించారు. అనంతరం గ్రామ పెద్దలను సన్మానించారు. కార్యక్రమంలో శంకర్, తిరుపతి, మహేందర్, రమేశ్, ప్రభాకర్, వెంకన్న, సంటెన్న, శంకర్, రాజారెడ్డి, వేణు, గంగన్న పాల్గొన్నారు.

నాగోబా జాతరకు ప్రత్యేక బస్సులు

ఇంద్రవెల్లి, ఫిబ్రవరి 10 : నాగోబా జాతరను పురస్కరించుకొని ఆర్టీసీ అధికారులు ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేశారు. నాగోబా జాతరకు బస్సులు రావడంతో ఆటోలు, జీబులా కోసం వేచిచూడాల్సిన అవసరం లేదని జాతరకు వచ్చే భక్తులు తెలుపుతున్నారు. అన్ని బస్సులు కెస్లాపూర్ జాతర మిదుగా వెళ్తున్నాయి. ప్రయణికులు అగేందుకు ఆర్టీసీ బస్టాండ్‌ను అధికారులు ఏర్పాటు చేశారు. ఆర్టీసీ అధికారులు జాతరకు ప్రత్యేక బస్సులు నడుపడంతో భక్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

భక్తులకు తాగునీటి సౌకర్యాలు

నాగోబా జాతరకు వచ్చేభక్తులకు ఆర్‌డబ్ల్యూఎస్ శాఖతోపాటు మాజీ సర్పంచ్‌లు, మీషన్ భగీరథ పథకం ఆధ్వర్యంలో తాగునీటి సౌకర్యాలు కల్పించారు. జాతరలో ప్రతిచోటా నల్లాలు ఏర్పాటు చేయడంతో భక్తులకు తాగునీటి ఇక్కట్లు తప్పాయి. అధికారులు అందుబాటులో ఉండి తాగునీటి సమస్యలు రాకుండా ముందస్తు చర్యలు తీసుకుంటున్నారు. జాతరలో నిర్మించిన ట్యాంకులకు మీషన్ భగీరథ పథకం నీటిని సరఫరా చేస్తున్నారు.

పోలీస్ కంట్రోల్ రూం వద్ద బందోబస్తు నిర్వహిస్తున్న పోలీసులు

జాతరలో భారీ పోలీస్ బందోబస్తు

నాగోబా జాతరలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ఉట్నూర్ డీఎస్పీ నాగేందర్‌తోపాటు ఉట్నూర్ సీఐ రామకృష్ణ, ఇంద్రవెల్లి ఎస్ఐ డి సునీల్ ఆధ్వర్యంలో భారీ పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు. నాగోబా ఆలయంతోపాటు గోవాడ్ ప్రాంతం, మర్రిచెట్ల ప్రాంతం, బస్టాండ్ వద్ద, కెస్లాపూర్ గ్రామం వద్ద ప్రత్యేక పోలీస్ సిబ్బందిని నియమించి పర్యవేక్షణ చేస్తున్నారు. భకుల్త రద్దీ ఉన్న ప్రాంతంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి ప్రత్యేక నిఘా ఉంచారు. రాత్రిపగలు పేట్రోలింగ్ నిర్వహిస్తు పరివేక్షణాలు చేపడుతున్నారు. నాగోబా ఆలయానికి దర్శణం కోసం వచ్చిన భక్తులకు తనిఖీలు చేసి లోపలికి పంపుతున్నారు. నాగోబా ఆలయంలోపాటు గోవాడ్ వద్ద పోలీసులను ఏర్పాటు చేశారు. ముందస్తు పకడ్బింగా చర్యలు తీసుకున్నారు.

భక్తుల కోసం వైద్య శిబిరం ఏర్పాటు

జాతరలో భక్తుల రద్దీ పెరగడంతో వ్యాధులు ప్రబలకుండా వైద్యశాఖ ఆధ్వర్యంలో ముందస్తు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు. జాతరలో వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసి భక్తులకు వైద్యసేవలు అందిస్తున్నారు. మెస్రం వంశీయులు బసచేస్తున్న ప్రాంతాలకు వైద్య సిబ్బందిలు వెళ్లి ఎప్పటికప్పుడు వారి ఆరోగ్య విషయాలు తెలుసుకుంటున్నారు. ఆరోగ్య సమస్యలు వచ్చినా వారు వైద్య శిబిరానికి వెళ్లి వైద్యం పొందుతున్నారు. వైద్య శిబిరంలో అన్ని రకాల ముందులు అందుబాటులో ఉంచారు.

ఆర్టీసీ బస్టాండ్‌లో బస్సు ఎక్కుతున్న ప్రజలు

నల్లాల వద్ద నీళ్లు పట్టుకుంటున్న ప్రజలు

వైద్య శిబిరానికి తరలివచ్చిన ప్రజలు

నమస్తే తెలంగాణ CLASSIFIED

ప్లాట్లు కొనబడును

★హయత్ నగర్, పెద్ద అంబర్‌పేట్, పసుమాముల, రామోజీ, కోహెడ, సాగర్ పంపు, గుంతపల్లి, బాటసింగారం, తూప్రాన్‌పేట్, మల్కాపురం, పోచంపల్లిలో ప్లాట్లు కొనబడును. J.సుధాకర్ గౌడ్: 9948172307, 9390846522.
NT-313886

మద్యం (ఆల్కహాల్) మాన్పించబడును

★త్రాగుడు (ఆల్కహాల్) & సిగరెట్, గుట్కా మానండి, మాన్పించండి. త్రాగేవారికి తెలియకుండా ఆయుర్వేద మందుతో మాన్పించవచ్చు. సైడ్ ఎఫెక్ట్స్ లేవు. కేంద్రీయ ఆయుర్వేద. ఫోన్: 9652899899.
NT-319957

COMMERCIAL FOR SALE

★సికింద్రాబాద్, S.D. రోడ్, స్పష్నలోక్-సూర్యకిరణ్ కాంప్లెక్స్, 500 Sft., ఆఫీస్/గోడౌన్, 5వ అంతస్తు, సపరేట్ బాత్‌రూమ్, లిఫ్ట్/పార్కింగ్ కలిగిన కమర్షియల్ స్పేస్ అమ్మకం కొరకు కలదు. సెల్: 9246242210.
NT-319436

CHANGE OF NAME

★I, SREENIVASULU DASARI, S/O DASARI SUBBAIAH, (Old name) R/o H.No. A-1, KK-2 Bungalows, Mandamarri, Mandal: Mandamarri, Dist: Mancherial. I have Changed my name as DASARI SRINIVASULU S/O DASARI SUBBAIAH, (New Name)
NTK-317345

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

Classified Ads
మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం.. మన
నమస్తే తెలంగాణ
క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం
4 లైన్ల ప్రకటన కేవలం 200/- మాత్రమే
ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి 50/- మాత్రమే
3+1 స్కీం కలదు
ప్రకటనల విభాగం...
GST 5% వర్తించును
మంచిర్యాల: 91827 77676, ఆదిలాబాద్: 91827 77679
నిర్మల్: 91827 77671, 91827 77677